


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 22-7-2025

సంపుటి: 21 సంచిక: 102
పేజీలు: 8 వెల: రూ.1

ఫరీద్‌పేటలో హత్యకు గురైన వైకాపా నాయకులు సత్తారు గోపి కేసులో పోలీసులు ప్రభుత్వ ఒత్తిడికి లొంగిపోయారని, అందుకే అసలు నిందితులను వదిలేసి వెనుక వరుసలో ఉన్నవారిని అరెస్ట్ చేశారని నాలుగు రోజుల క్రితం పోలీసులు పెట్టిన ప్రెస్‌మీట్ తర్వాత జిల్లాలో వినిపించిన వ్యాఖ్యలు ఇవి. నిజమే.. ఒక రాజకీయ పార్టీ నాయకుడు హత్యకు గురైనప్పుడు, అది కూడా ప్రతిపక్షానికి చెందిన నేత అయితే కచ్చితంగా అధికార పార్టీ ఒత్తిడి ఉంటుంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా దీనికి మినహాయింపు ఉండదు. కాకపోతే పోలీసులు మాత్రం ఎవరు ఏమనుకున్నా తమ పని తాము పూర్తిచేశామని నిరూపించారు. అలా అని వారి మీద ఒత్తిళ్లు లేవా అంటే.. ఉన్నాయి. కాకపోతే ఒకసారి కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా ఉంటాయన్నదే ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఆలోచన.



# రెడ్డిగారూ.. మీరు సూపర్ 'బాస్'!

- ఒత్తిడితో కేసు నీరుగార్చేశారని ఆరోపణలు
- అంతలోనే అమ్మినాయుడు అరెస్ట్
- నాయకులు చెప్పినా కుదరదన్న ఎస్పీ
- సత్తారు గోపీ హత్యకేసులో కనబడిన రాజకీయ కోణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి పాలనలో హత్యా రాజకీయాలు ఎక్కువయ్యాయని ప్రతిపక్షం నిత్యం ఆరోపిస్తున్న నేపథ్యంలో అధికార పార్టీ నాయకుడ్ని అరెస్టు చేయడం చిన్న విషయం కాదు. గత ఏడాది జరిగిన కూన ప్రసాద్ హత్యకేసు మాదిరిగా గోపి హత్య కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపించాయి. ప్రభుత్వ పెద్దలు, రాజకీయ ఒత్తిడిని సైతం లెక్క చేయకుండా నిజాయితీగా వ్యవహరించి గోపి హత్యకేసుతో సంబంధం ఉన్నవారిని అరెస్టు చేయడంతో పోలీసులపై స్థానికులకు నమ్మకం పెరిగింది. అందులో భాగంగానే గోపీ హత్య కేసులో కీలక నిందితుడుగా అనుమానిస్తున్న - మిగతా చివరి పేజీలో



- జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో తలుపు తట్టనున్న అవకాశం
- అయితే ఏపీ లేదా బీహార్ ఎన్డీయే మిత్రులకు ఛాన్స్
- ఢిల్లీ నుంచి కబురు అందినట్లు టీడీపీ వర్గాల్లో చర్చ
- బీహార్ నుంచైతే హరివంశ్ నారాయణ్ సింగ్.. ఏపీ నుంచైతే ప్రతిభ లేదా యనమల

"పదవీకాలం పూర్తి కాకముందే రాష్ట్రపతి తన పదవికి రాజీనామా చేసినా లేదా మరణించిన సందర్భాల్లో కొత్త రాష్ట్రపతిని ఎన్నుకునే వరకు ఉప రాష్ట్రపతే రాష్ట్రపతిగా వ్యవహరించవచ్చని రాజ్యాంగంలో నిర్దేశించారు. కానీ ఉప రాష్ట్రపతి పదవే ఖాళీ అయితే.. మళ్లీ కొత్త ఉప రాష్ట్రపతిను ఎన్నుకునే వరకు ఆ బాధ్యతలను ఎవరు నిర్వర్తించాలన్నది రాజ్యాంగంలో అసలు ప్రస్తావించలేదు. ఎందుకంటే.. భారత పార్లమెంటరీ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పదవీ కాలం పూర్తికాకముందే ఉప రాష్ట్రపతి తన పదవికి రాజీనామా చేయడం, తద్వారా ఆ పదవి ఖాళీ అయిన సందర్భాలు ఇది మూడోసారి మాత్రమే. అందుకే ఈ పదవిని వీలైనంత త్వరగా భర్తీ చేయడానికి ఎలక్టోరల్ అధికారులు ప్రయత్నిస్తుంటారు. తాజాగా ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేయడంతో ఆ పదవి ఖాళీ అయ్యింది. నిబంధనల ప్రకారం 60 రోజుల్లోపు కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నుకోవాల్సి ఉంది. దాంతో అభ్యర్థి ఎంపిక దిశగా ఎన్డీయే సర్కారు వడివడిగా అడుగులు వేస్తోంది. వాస్తవానికి 2027 వరకు ధన్‌ఖడ్ పదవీకాలం ఉన్నా.. అనారోగ్య కారణాలు చూపి సోమవారం రాష్ట్రపతికి రాజీనామా లేఖ పంపించారు. దాంతో ఆయన స్థానంలో కొత్త ఉప రాష్ట్రపతిని ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది."

# ఉపరాష్ట్రపతి రేసులో తెలుగు నేతలు!



సత్యంన్యూస్, శ్రీకాకుళం

### ఆ రెండు పార్టీల్లో ఒకదానికి అవకాశం

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ బీజేపీ నుంచి వచ్చారు. ఆమె పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా ఆ స్థానంలో బీజేపీకి చెందిన నేతనే ఎన్నుకుని కూర్చోబెట్టే అవకాశం ఉంది. అందువల్ల ఉప రాష్ట్రపతి పదవిని ఎన్డీయే కూటమికి చెందిన ఏదో ఒక పార్టీకి ఇవ్వాలనే యోచనలో ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలుగు రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పార్టీ తో పాటు.. బీహార్‌లో అధికారంలో ఉన్న ఎన్డీయే భాగస్వామి జేడీయూ నేత, సిటింగ్ ఎంపీకి ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ఢిల్లీ వర్గాల ద్వారా తెలిసింది. పేరుకు తెలుగు రాష్ట్రాలు అన్నా.. ఈ రెండుచోట్లా టీడీపీకి చెందిన నేతకే అవకాశం ఇవ్వడానికే ప్రధాని మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది. ఉప రాష్ట్రపతి పదవి దేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి మాత్రమే కాకుండా రాజ్యసభకు చైర్మన్ కూడా ఉప రాష్ట్రపతి వ్యవహరించడం వల్ల ఈ పదవికి మంచి ప్రాధాన్యతే ఉంది. హిందీ, ఇంగ్లిష్‌తో పాటు ప్రాంతీయ భాషల మీద పట్టు కలిగిన నేతలు - మిగతా లోపలి పేజీలో



- రెండు దశాబ్దాల్లో వందల సంఖ్యలో మహిళలు మాయం
- అత్యాచారం, ఆపై హత్య చేసి రహస్యంగా మృతదేహాల ఖననం
- ఈ పాపకృత్యంలో శ్రీమంజూనాథ దేవస్థానం వర్గాల పాత్ర
- అక్కడి పారిశుధ్య కార్మికుడిని బెదిరించి మృతదేహాల తరలింపు
- అజ్ఞాతంలో ఉన్నా పదేళ్లపాటు అతడిని వెంటాడిన భయం, పశ్చాత్తాపం
- పోలీసుల వద్దకు స్వయంగా వెళ్లి ఫిర్యాదు.. సిట్ ఏర్పాటు



# ధర్మస్థలంలో.. ధర్మం చెర!

అది ధర్మస్థలం పోలీస్ స్టేషన్.. స్టేషన్ సిబ్బంది ఎవరి పనుల్లో వారు బిజీగా ఉన్నారు... ఆ సమయంలో ఓ ఆగంతకుడు అక్కడికి వచ్చి స్టేషన్ అధికారిని కలిసి ఏదో చెప్పాడు. తర్వాత.. అటు నుంచి అటే దక్షిణ కన్నడ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి వెళ్లి నేరుగా జిల్లా ఎస్పీని కలిసి అదే విషయం వెల్లడించాడు. అతగాడు చెప్పింది విని ధర్మస్థల పోలీ సులతో పాటు జిల్లా ఎస్పీ కూడా ఒక్కసారి షాక్ అయ్యారు. కాసేపు ఆగంతకుడు చెప్పింది నిజమా లేక మతి భ్రమించి మాట్లాడుతున్నాడా అన్న సందిగ్ధంలో పడ్డారు. కానీ తాను చెప్పింది కఠోర వాస్తవమని.. దాదాపు ఇరవయ్యేళ్ల వ్యవధిలో వందలాది శవాలను తన స్వహస్తా లతో భూస్థాపితం చేశానని.. ఇప్పుడు పశ్చాత్తాపంతో నిజాలు చెప్పడానికి వచ్చానని ఆ వ్యక్తి చెప్పుకొచ్చాడు. ఇంతకూ ధర్మస్థలలో అతడు చెప్పిన దారుణాలు ఎందుకు.. ఎప్పుడు జరిగాయి..? ఒక్కసారి చూద్దాం.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

శ్రీమంజూనాథుడు కొలువైన పవిత్ర పుణ్యక్షేత్రం కర్ణాటక రాష్ట్రంలోని దక్షిణ కన్నడ జిల్లాలో ఉన్న ధర్మస్థల క్షేత్రం. ఆధ్యాత్మికతకు నెలవుగా ఉండే ఈ దేవస్థానం పరిధిలోనే దారుణాతిదారుణమైన శవాల అక్రమ తరలింపు ఉదంతం జరగడం చర్చనీయాంశంగా మారింది. శవాలు మాయం చేసిన వ్యక్తి, చేయించిన వారు కూడా మంజూనాథ దేవస్థానంతో సంబంధం ఉన్న వారు కావడం విశేషం. ఈ క్షేత్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాది మహిళలు, బాలికల మృతదేహాలను తాను రహస్యంగా తరలించి ఖననం చేసేవాడినని దేవస్థానంలో పరిశుధ్య కార్మికుడిగా పని చేసిన వ్యక్తే స్వయంగా వెల్లడించడం సంచలనంగా మారింది. 1995 నుంచి 2014 వరకు దాదాపు ఇరవయ్యేళ్లుగా తాను పాపకృత్యాలు చేశానని కొద్దిరోజుల క్రితం అతను పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మరీ వివరించాడు. మంజునాథ ఆలయ వర్గాల ఒత్తిడి, బెదిరింపుల కారణంగానే ఈ కృత్యాలకు పాల్పడాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. ఖననం చేయమని తనకు అప్పగించిన మృతదేహాలపై లైంగిక దాడి, అనంతరం హత్య జరిగిన ఆనవాళ్లు కనిపించాయని ఫిర్యాదులో వివరించాడు. మొదట పోలీసులు ఈ విషయాన్ని నమ్మకపోయినా చివరికి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఉదంతం కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీలో సైతం అలజడి రేపింది. దీనిపై పూర్తిస్థాయి విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసింది.

### రక్షణ కల్పిస్తేనే పూర్తి వివరాలు

తనచేత ఈ పని చేయించిన ఆలయ వర్గాల నుంచి తనకు ప్రాణ హాని కలగవచ్చని, అందువల్ల పూర్తి రక్షణ కల్పిస్తేనే గత రెండు దశాబ్దాలుగా జరిగిన మృతదేహాల అక్రమ ఖననాల వివరాలు పూర్తిగా చెబుతానని, ఖననం చేసిన ప్రదేశాలు కూడా చూపిస్తానని సదరు మాజీ పారిశుధ్య కార్మికుడు పోలీసులకు స్పష్టం చేశాడు. ధర్మస్థలం మంజునాథ ఆలయంలో సదరు కార్మికుడు పని చేస్తున్నప్పుడు ఆ దేవస్థానానికి చెందిన కొందరు తరచూ మహిళలు, బాలికల మృతదేహాలను తనకు అప్పగించి, వాటిని పూడ్చిపెట్టాలని ఆదేశించేవారు. తాము చెప్పినట్లు వాటిని పూడ్చడం లేదా దహనం చేయకపోతే అతన్ని, అతని కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించడంతోపాటు..తీవ్రంగా కొట్టేవారట! పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే మంజూనాథ ఆలయాన్ని ఆ ప్రాంతంలో అత్యంత పలుకుబడి కలిగిని హెగ్డే కుటుంబం నిర్వహిస్తోంది. 'ఆ 1995లో పారిశుధ్య కార్మికుడిగా చేరిన తనను కొన్నాళ్లకే భయానక నేరాలకు సాక్ష్యాలను మాయం చేసే పనికి వాడుకోవడం ప్రారంభించారు' అని అతడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తొలుత తాను ఆ శవాలు నేత్రావతి నది వద్ద ఆత్మహత్య చేసుకున్నవారివో లేక ప్రమాదవశాత్తూ చనిపోయినవారివో అనుకునేవాడినని.. కానీ ఆ శవాలపై లైంగిక దాడి ఆనవాళ్లు గుర్తించాక దారుణాలు జరుగుతున్నాయని అర్థమైందన్నాడు. 2010 నాటి ఒక సందర్భాన్ని ప్రస్తావించిన ఫిర్యాదుదారుడు.. 'పెట్రోల్ పంప్ నుంచి 500 మీటర్ల అవతలికి నన్ను సూపర్‌వైజర్లు పంపారు. అక్కడ ఒక బాలిక మృతదేహం కనిపించింది. పదిహేనేళ్లకు మించి వయసుండదు. ఒంటిపై స్కూల్ యూనిఫాం షర్ట్ మాత్రమే ఉంది. ఆమెపై లైంగిక దాడి జరిగినట్టు స్పష్టమైన ఆనవాళ్లు కనిపించాయి' అని పేర్కొన్నాడు. ముఖంపై యాసిడ్ చల్లి ఉన్న ఒక యువతి మృతదేహాన్ని సైతం తాను తగులబెట్టానని పేర్కొన్నాడు.

### భయంతో ఇన్నాళ్లూ అజ్ఞాతవాసం

చివరికి తన కుటుంబంతో సంబంధం ఉన్న ఒక బాలిక కూడా వారి చేతిలో దాడికి గురైందని చెప్పుకొచ్చాడు. దేవస్థానం సూపర్‌వైజర్లతో లింకు ఉన్న ఒక వ్యక్తి తనపై లైంగికదాడి చేశాడని ఆ బాలిక చెప్పడంతో భయపడిన పారిశుధ్య కార్మికుడు ఉద్యోగాన్ని వదిలేసి 2014లో ధర్మస్థలను వదిలి పారిపోయాడు. పొరుగు రాష్ట్రంలో జీవిస్తున్నా, తనను ఎక్కడ పట్టుకుంటారోనన్న భయంతో తరచూ ఇళ్లు మార్చేవాడట. ఇటీవల ఒకరోజు రహస్యంగా ధర్మస్థలికి వచ్చి తాను గతంలో పాతిపెట్టిన శవాన్ని వెలికితీసి, దాని ఫొటో తీశాడు. ఫిర్యాదుతోపాటు ఆ ఫొటోను కూడా పోలీసులకు అప్పగించాడు. ధర్మస్థల ప్రాంతంలో ఎక్కడెక్కడ శవాలను పాతిపెట్టానో అన్నీ పోలీసుల సమక్షంలో వెలికి తీసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఈ ఘాతుకాలకు పాల్పడిన వారి పేర్లు భయటపెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పాడు. అయితే తనకు, తన కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని కోరాడు.

### పాత కేసులు మళ్లీ తెరపైకి

బెదిరించి తనతో తప్పులు చేయించారని, నిస్సహాయ స్థితిలో లెక్కలేనన్ని మృతదేహాలను మాయం చేశారనని చెబుతున్న సదరు వ్యక్తి ఇప్పుడు మానసిక క్షోభ అనుభవిస్తూ.. పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు. మరోవైపు భయం వెంటాడుతోంది. అందుకే తెగించి చివరికి పోలీసులను ఆశ్రయించినట్లు కనిపిస్తోంది. పోలీసుల సమక్షంలో తాను గతంలో పూడ్చిన శవాలను వెలికి తీసేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నాడు. ఆ శవాలకు తగిన పద్ధతిలో అంత్యక్రియలు చేయకపోతే వాటి ఆత్మలు శాంతించవని, తనను కూడా అపరాధ భావం వెంటాడుతుందని పేర్కొన్నాడు. మాజీ పారిశుధ్య కార్మికుడు తన ఫిర్యాదులో పేర్కొన్న అంశాల్లో ఎంత నిజముందో తెలియదు గానీ.. కర్ణాటక అసెంబ్లీని మాత్రం ఈ అంశం కుదిపివేసింది. దీనిపై సిట్ వేసి పూర్తిస్థాయి దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించాల్సి వచ్చింది. గుర్తు తెలియని మృతదేహాల పూడ్చివేత, దహనం ఉదంతాలు వెలుగులోకి వచ్చిన క్రమంలో తమ పిల్లలు కనిపించడం లేదన్న ఫిర్యాదులు పెరుగుతున్నాయి. 2003లో స్నేహితులతో కలసి ధర్మస్థలకు వెళ్లిన అనన్య భట్ అనే మెడికో అదృశ్యమైంది. తాజా ఫిర్యాదు నేపథ్యంలో తమ కుమార్తె మిస్సింగ్ కేసును మళ్లీ ఫిర్యాదు చేయాలంటూ ఆమె తల్లి సుజాతా భట్ దక్షిణ కన్నడ జిల్లా పోలీసులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇలాగే పలువురు తమ కుమార్తెల ఆచూకీ కనుగొనాలంటూ పాత కేసులతో మళ్లీ పోలీసుల వద్దకు వస్తున్నారు.



• ఎడిటోరియల్

# పాలసీ మార్పుతోనే మద్యం స్కామ్!

ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కూటమి, ప్రతిపక్షం మధ్య మద్యం కుంభకోణంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు సాగుతున్నాయి. రెడ్‌బుక్ పాలనలో భాగంగా తమ పార్టీ నేతలను లేని లిక్కర్ స్కామ్‌లో ఇరికించడం ద్వారా చంద్రబాబు సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వైకాపా ఆరోపిస్తుంటే.. బ్రాండెడ్ మద్యాన్ని తొక్కిపెట్టి చీప్ క్వాలిటీ లిక్కర్‌ను ప్రోత్సహించడం ద్వారా రూ.మూడువేల కోట్లకుపైగా కుంభకోణానికి గత జగన్ ప్రభుత్వం పాల్పడిందని కూటమి సర్కారు ఆరోపిస్తోంది. రాజకీయ ఆరోపణలు ఎలా ఉన్నా ఈ కుంభకోణాన్ని సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) దర్యాప్తు చేస్తూ అరెస్టుల పరంపర కొనసాగిస్తోంది. దీనిపై ఏసీబీ కోర్టులో ఇటీవలే 300కుపైగా పేజీల ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. ఈ కుంభకోణంలో మొదటిసారి మాజీ సీఎం జగన్ పేరును ఈ ఛార్జిషీటులోనే ప్రస్తావించారు. మద్యం ముడుపుల అంతిమ లబ్ధిదారు ఆయనేనని అందులో ఆరోపించారు. 2024కు ముందు అధికారంలో ఉన్న వైకాపా ప్రభుత్వం మద్యం వ్యసనాన్ని, అమ్మకాలను తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాల ముసుగులో బ్రాండెడ్ మద్యం రాష్ట్రంలోకి రాకుండా చేసిందని.. దాని స్థానంలో వైకాపాకు అనుకూలంగా ఉన్న మద్యం తయారీదారులు ఉత్పత్తి చేసే నాసిరకమైన.. ఊరూపేరూ లేని బ్రాండ్‌లను ప్రవేశపెట్టడంతోపాటు మద్యం వ్యాపారాన్ని ప్రైవేట్ షాపుల నుంచి తప్పించి ప్రభుత్వ షాపుల ద్వారానే విక్రయించింది. మొత్తం ఈ వ్యవహారంలో ముడుపులే కీలకపాత్ర పోషించాయన్నది ప్రధాన ఆరోపణ. ఎన్నికల అనంతరం ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ఎన్డీయే సర్కారు ఈ కుంభకోణం నిగ్గుతేల్చేందుకు సిట్‌ను నియమించింది. అయితే దీనికి సంబంధించి కొన్ని ప్రశ్నలకు అటు సిట్ గానీ ఇటు ప్రభుత్వం గానీ సమాధానాలు చెప్పడంలేదు. ప్రైవేట్ వ్యక్తులు చేస్తున్న లిక్కర్ వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టాలన్న నిర్ణయంతోనే ఈ స్కామ్‌కు బీజం పడింది. కానీ కొత్త మద్యం పాలసీకి కేబినెట్ ఆమోదం ఉందా.. లేదా? అన్న విషయాన్ని అటు సిట్ నివేదికల్లో గానీ.. ఇటు ప్రభుత్వం ప్రకటించిన శ్వేతపత్రంలో గానీ లేదు. ఈ స్కామ్‌లో బాధ్యులను వేర్వేరు స్థాయిల్లో చూడాల్సి ఉంది. లంచాలు తీసుకోవడం, కుట్ర చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడ్డారంటూ సిట్ ఛార్జ్‌షీట్‌లో ప్రస్తావించిన నాయకులు, అధికారులు, ప్రైవేట్ వ్యక్తులపై అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరుగుతోంది. ఆరోపణలు రుజువైతే వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. ప్రభుత్వం తీసుకునే ప్రతి విధాన నిర్ణయానికి మొత్తం మంత్రిమండలి సామూహికంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. కుంభకోణానికి కారణమైన మద్యం పాలసీని క్యాబినెట్ ఆమోదంతో అమలుచేసి ఉంటే.. దాని పర్యవసానాలకు అప్పటి ముఖ్యమంత్రి నేతృత్వంలోని మొత్తం మంత్రివర్గం జవాబుదారీ అవుతుంది. మరోవైపు ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ పరిధిలో ఈ కుంభకోణం జరిగినందున ఆనాడు ప్రత్యక్షంగా ఈ శాఖను పర్యవేక్షించిన మంత్రి నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో జరిగిన వాన్‌పిక్ కుంభకోణంలో అప్పటి సంబంధిత శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ జైలు కెళ్లడమే దీనికి ఉదాహరణ. ఇది ప్రజాస్వామ్య సంప్రదాయం. పాలక పెద్దల తప్పిదాలే కాకుండా అధికార వ్యవస్థ నిష్క్రియాపరత్వం కూడా శిక్షార్హమేనని చట్టాలు ఘోషిస్తున్నాయి. చట్టవిరుద్ధమైన ఆదేశాలను అమలుచేయడం లేదా అక్రమాలు జరుగుతున్నప్పుడు నిర్లిప్తంగా ఉండిపోవడం కూడా నేరంతో సమానమే. ఆ దృష్టితో చూస్తే విధాన నిర్ణయాల రూపకల్పన, అమలులో కీలకపాత్ర పోషించిన, అక్రమాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారులు కూడా మద్యం కుంభకోణానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వాన్‌పిక్ స్కామ్‌లోనే ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి అరెస్టు కావడం, జైలుకెళ్లడం దీనికి ఉదాహరణకు చెప్పవచ్చు. సిట్ ఛార్జ్‌షీట్ ప్రకారం.. వైకాపా పెద్దలు డిస్టిలరీల యజమానులను బెదిరించి 12 నుంచి 20 శాతం కమీషన్లు గుంజారు. దీని సూత్రధారి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కాగా ఆ సొమ్ము ఇద్దరు ఎంపీల ద్వారా అప్పటి ముఖ్యమంత్రికి అందిందనేది ప్రధాన ఆరోపణ.. అంటే ఆయనే ప్రధాన లబ్ధిదారు. ఇది కొందరి అవినీతి మాత్రమే కాదు.. విధానాల రూపకల్పన ప్రక్రియనే దుర్వినియోగం చేసి, ప్రజా ప్రయోజనాలను ఫణంగా పెట్టి వ్యవస్థను స్వార్థానికి వాడుకున్న దుశ్చర్య. న్యాయస్థానంలో ఆరోపణలు రుజువైతే ఈ కుట్రలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరూ బాధ్యత వహించక, శిక్ష ఎదుర్కోక తప్పదు.

## అనాథ చిన్నారులకు ఆర్థిక సాయం



(సత్యంన్యూస్, నరసన్నపేట)

నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన బండి కృష్ణ, స్వాతి దంపతులకు మోహిని, యోగిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి స్వాతి క్యాన్సర్‌తో, తండ్రి కృష్ణ బైక్ ప్రమాదంలో మృత్యువాత పడడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలారని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వాళ్ళు వెంటనే స్పందించి పలువురు దాతల ద్వారా సేకరించిన రూ.50వేలు చిన్నారులకు అందజేసి ఇద్దరు పిల్లల పేరున ఫిక్సిడ్ డిపోజిట్ చేయమని సర్పచ్ యమ్.రాముని కోరినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలైన చిన్నారులకు ప్రతిఒక్కరు సామాజిక స్పృహతో ముందుకు వచ్చి సాయం అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, ధర్మవపు పూర్ణాచారి, పిల్లల రమేష్, ఉంగరాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్డన్ సెర్చ్‌తోనే నేర నియంత్రణ

(సత్యంన్యూస్, టెక్కలి)

నేర నియంత్రణ చర్యలలో భాగంగా టెక్కలి సీఐ ఎం.విజయ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం టెక్కలి పోలీస స్టేషన్ పరిధిలో సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారి పరిధిలో గల పలు వార్డు, గ్రామాలలో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ మద్యం, గంజాయి, నిల్వలపై ఆరా తీశారు. పాత నేరస్థులు, అనుమానిత, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి, వారి జీవన విధానం, వృత్తి విధానంపై ఆరా తీసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి, నేర నియంత్రణ చర్యలు చేపట్టారు. తనిఖీల్లో సరైన వాహన పత్రాలు లేని 17ద్విచక్ర వాహనాలు గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తవ్యక్తులు సమాచారాన్ని తెలపాలని సూచించారు.



## ఈ కాలం పిల్లాడు" పుస్తక బహూకరణ

(సత్యంన్యూస్, పొందూరు)

కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య విభాగం పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన ఈ కాలం పిల్లాడు నవలను వాణిజ్యవేత్త గుడ్ల అన్నాజీరావు మంగళవారం గ్రంథాలయాలకు బహూకరించారు. అన్నాజీరావు సంబంధిత ప్రచురణ సంస్థల నుంచి కొనుగోలు చేసి నెహ్రూ పార్కులోని శాఖా గ్రంథాలయం, గాంధీనగర్‌లోని నవతా గ్రంథాలయం, మహారాజా మార్కెట్‌లోని నాగవంశ గ్రంథాలయం, బరంపురం వీధిలోని కాశీవిశ్వేశ్వర గ్రంథాలయానికి ఈ పుస్తకాలను అన్నాజీరావు అందజేశారు.



## ముని రామకృష్ణకు పీహెచ్‌డీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ), శ్రీకాకుళం పరిపాలనా అధికారి ముని రామకృష్ణ ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) తిరుపతి నుండి డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ) అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో నెట్‌వర్క్ ఎకనామిక్స్ – భాగస్వామ్య ఆధారిత సామాజిక అభ్యాస మార్కెట్లలో ధరల విధానాలు అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ పరిశోధనను డాక్టర్ కె.పి.నవీన్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ముని రామకృష్ణ బీటెక్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, ఎం.ఫిల్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఆర్‌జీయూకేటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పరిపాలనా అధికారిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్‌జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.డి.జి. బాలాజీ, అకడమిక్ డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, డీన్ వెల్ఫేర్ రవి, మోహన్ కృష్ణ చౌదరి, ఇతర అధికారులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ముని రామకృష్ణకు అభినందనలు తెలియజేశారు.



## చంద్రబాబు బతుకు అంతా మోసాలమయమే



(సత్యంన్యూస్, నరసన్నపేట)

చంద్రబాబును గెలిపించి రాష్ట్ర ప్రజలు ఓడిపోయారని. ఇప్పుడిప్పుడే తామంతా మోసపోయామని బాధ పడుతున్నారని నరసన్నపేట నియోజకవర్గ వైకాపా యువ నాయకులు, పోలాకి జడ్పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య స్పష్టం చేశారు. మంగళవారం నరసన్నపేట మండలం పారశెల్లి, తెలగవలస, చెన్నాపురం పంచాయతీల్లో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు ప్రతిసారి ఎన్నికల ముందు మాయమాటలు, బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం, ఎన్నికలు అయ్యాక ఇచ్చిన వాగ్దానాలు తుంగలో తొక్కేయడం సాధారణ విషయమేనని విమర్శించారు. చంద్రబాబునాయుడు బ్రతుకంతా మోసాలేనని... ప్రజలే మళ్లీమళ్లీ ఆయనను గెలిపించి మోసపోతున్నారని ఆయన ఆరోపించారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ఇస్తానని చెప్పి.. ఇప్పటివరకు ఆ హామీ ఊసే లేదన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తానని చెప్పి యువతను మోసం చేశారన్నారు. ఖరీఫ్ కాలం ప్రారంభం అయినప్పటికీ రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఇప్పటి వరకు ఇవ్వలేదని రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు మురళీధర్, చింతు రామారావు, సురంగి నర్సింగరావు, ఆడంగి సూర్యనారాయణ, కొంక్యాన నరసింహమూర్తి, పూలసారీ అప్పన్న, పాగోటి గోవిందరావు, బార్ల వేణుగోపాలరావు, చింతల అసిరినాయుడు, కనపల శేఖర్‌రావు, యాబాజీ రమేష్ , పుట్ట ఆదిలక్ష్మి, అంపోలు వెంకటరమణ సుధ, బగ్గు సతీష్, నేతింటి రాజేశ్వంరావు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భాస్కరభట్లకు సిల్వర్ జూబ్లీ: ఆ పాటకు పాతికేళ్లు!!

ఉత్తరాదిన బుల్లితెర వీక్షకులకు ఎల్లీ అవ్ రామ్ నిరంతరం ట్రీటిస్తోంది. టెలివిజన్ రియాలిటీ షోలతో బిజీగా ఉన్న ఎల్లీ అవ్ రామ్ ఇటీవలే ఓ సింగిల్ ఆల్బమ్ లోను నటించింది. ఇంతలోనే ఎల్లీ తన సోషల్ మీడియా ఫ్యాన్స్ కోసం స్పెషల్ ఫోటో షూట్‌తో దూసుకొచ్చింది. ఈ ఫోటోషూట్ సంథింగ్ స్పెషల్ అనేంతగా అద్భుతమైన ఎక్స్‌ప్రెషన్స్ తో ఎల్లీ కట్టిపడేసింది. ఇది ఆహ్లాదకరమైన బెడ్ రూమ్ లో అవ్ రామ్ స్టైలీ రూపాన్ని ఎలివేట్ చేసిన ఫోటోషూట్. పడక గదిలో బెడ్ పై ఎల్లీ రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చింది. స్టైలిస్టూ, చిలిపిగా అల్లరిగా, కొంటెగా రకరకాలుగా ముఖ కవళిక‌ల్ని మారుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చిలిపి అల్లరి ఎల్లీ మనసులు గెలుచుకుంది అంటూ అభిమానులు ఈ ఫోటోషూట్ ని ప్రశంసిస్తున్నారు. తన తాజా ఆల్బమ్ చందానియా.. ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఎల్లీ ఇలా ఫోటోషూట్లతోను అభిమానులకు స్పెషల్ ట్రీటిస్తోంది.

### యూట్యూబర్ ప్రేమలో?

ప్రముఖ యూట్యూబర్, కంటెంట్ సృష్టికర్త అయిన ఆశిష్ చంచలానీతో ఎల్లీ అవ్‌రామ్ ప్రేమలో ఉందంటూ ప్రచారం సాగుతోంది. అతడితో ఎల్లీ అత్యంత సన్నిహితంగా ఉన్న ఫోటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయ్యాయి. కానీ ఆ తర్వాత ఈ జంట ఓ సింగిల్ ఆల్బమ్ కోసం కలిసి పని చేసారని తెలిసింది. ఇంతకుముందే ఆశిష్ – ఎల్లీ కలిసి తమ మ్యూజిక్ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాలో విడుదల చేయగా వారి మధ్య స్నేహం గురించి నెటిజనుల్లో గుసగుస మొదలైంది. కానీ ఇది కేవలం వృత్తిగతమైన స్నేహం మాత్రమేనని అర్థం చేసుకున్నారు. ఈ జంట నటించిన చందానియా మాస్టర్ ఆఫ్ మెలోడీ ఆల్బమ్‌లో భాగం. దీనిని విశాల్ మిశ్రా పాడారు, మిథూన్ స్వరపరిచారు. ఈ మ్యూజిక్ వీడియోలో హాస్యం, శృంగారం, డ్రామా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆ ఇద్దరి మధ్య అందమైన కెమిస్ట్రీ యువతరాన్ని ఆకర్షించింది. వెనిస్ నేపథ్యంలో ఈ పాటను చిత్రీకరించారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో



## బెడ్ రూమ్‌లో ఎల్లీ అవ్‌రామ్ చిలిపితనం



భాస్కరభట్ల రవికుమార్ మంచి కవి. అయితే కవి అయిన ప్రతి ఒక్కరూ గీత రచయిత కాలేరు. అయినా భాస్కరభట్లంత పాపులర్ కాలేరు. పాటకున్న మీటర్ వేరు. అది భాస్కరభట్లకు బాగా తెలుసు. కొంతమంది గీత రచయితలు గొప్ప పాండిత్యం ప్రదర్శిస్తారు. తమకున్న భాషా పరిజ్ఞానమంతా పాటల్లో గుమ్మరిస్తారు. 'ఈ పదం సామాన్యులకు అర్థం అవుతుందా, లేదా' అనేది ఆలోచించరు. అదే అడితే.. 'అర్థం కాకపోతే అర్థాలు తెలుసుకొని మరీ ఆస్వాదిస్తారు' అంటారు. ఆ మాటా కరెక్టే. సిరివెన్నెల సీతారామశాస్త్రి రాసిన ప్రతీ పాట, అందులోని ప్రతీ పదం మనకు అర్థమైపోయిందా? సినారె, వేటూరి.. వీళ్లంతా ప్రతీ పాటలోనూ సాధారమైన భాషే వాడారా? ఆ పాటల్లోని మాధుర్యం అర్థమవ్వడానికి శబ్దరత్నాకరాలు కొనుక్కోలేదూ..?

అయితే భాస్కరభట్ల ఆ టైపు కాదు. అందరి దగ్గరా శబ్దరత్నాకరాలు కొనుక్కొని, చదువుకొనేంత టైమూ, ఓపిక ఉన్నాయో లేదో అని అందరికీ అర్థమయ్యే పదాలతోనే పాట కట్టేయగలడు. మనకు తెలిసిన పదాలే.. మనం వాడే భాషే.. కానీ అతని కూర్పు.. తన నేర్పుతో పాటైపోతూ ఉంటుంది. అక్షరాల అమరికతో అల్లరి చేస్తాడు. పదాల పొందికతో సరదాలు సృష్టిస్తాడు. భావ సాగరంలో మునకేస్తాడు. భాషా ప్రవాహంలో మనల్ని ముంచేస్తాడు.

మాస్ పాటకు కేరాఫ్.. ప్రేమ పాటకు తనే పేరాగ్రాఫ్.. మనిషితనానికి, మనసు మౌనానికి ఆ పాటే ఆటోగ్రాఫ్!! భాస్కరభట్ల మంచి కమర్షియల్ రైటర్. అతని పాట వర్షాకాలంలో రోడ్డు పక్కన అమ్ముతున్న వేడి వేడి మొక్కజొన్న పొత్తు. ఎండాకాలంలో క్వాలిటీ ఐస్ క్రీమ్ బండీ. తనకు గిరాకీ తగ్గదు. తన పాటలో ఇంగ్లీష్ మిక్స్ చేస్తాడు. ఉర్దూ కలిపేస్తాడు. ఇంగ్లీష్ ముక్కలు ఇలా వచ్చి, అలా పోతుంటాయి. నానా భాషల సమ్మేళనం తన పాట. అయినా వినడానికి బాగుంటుంది. ట్రెండింగ్ లో ఉన్న పదాల్ని భాస్కరభట్ల భలే పట్టేస్తాడు. తన పాటల్లో పదాలు ట్రెండింగ్ లోని తెస్తాడు. భాస్కరభట్ల ఇచ్చిన హుక్ లైన్లు ఎన్ని సినిమాలకు టైటిళ్లు అయిపోలేదూ..?

ఒక్క పాట చాలు. జనాల్ని థియేటర్లకు రప్పించడానికి. అలాంటి ఒక్క పాటలు ఎన్నిచ్చాడో? 'ఎందుకే రమణమ్మా' బెస్ట్ ఎగ్జాంపుల్. అతని మాట చికెన్ ముక్క. అతని పాట చిల్డ్ బీర్ చుక్క. ఇంతకంటే ఏం చెప్పగలం? ఈ మాస్ గీతిస్ట్ గురించి? ఐటెమ్ పాట.. ప్రతీసారీ భాస్కరభట్లని వెదుక్కొంటూ వెళ్తుంది. ప్రతీసారీ ఆయన తన అక్షరాలతో అభ్యంగన స్నానం చేయించి, పదాల పరికిణీ కుట్టించి మరీ ముస్తాబు చేస్తాడు. ఐటెమ్ పాటంటే అంగాంగ వర్ణన అనుకొంటారంతా. కానీ ప్రతీ పాటనీ ఓ థీమ్ లా ప్రజెంట్ చేస్తాడు భాస్కరభట్ల. ఐటెమ్ గీతాల బాప్.. 'ఇప్పటికింకా నా వయసు..' పాటే తీసుకోండి. అందులో ఓ అమ్మాయి అల్లరి కనిపిస్తుంది. చాంతాడంత కోరికల లిస్టు దర్శనమిస్తుంది. ఆ పాటలో ముమైత్ ఖాన్ కంటే, భాస్కరభట్ల పదాలే సెక్సీగా ఉంటాయి.

తను మాస్ గీతాలే రాయలేదు. ప్రేమ పాటలతోనూ పరవళ్లు తొక్కాడు. జీవిత సారాన్ని చిన్న చిన్న ముక్కల్లో చెప్పేశాడు. బతుకు సారాన్ని పంక్తుల్లో తేల్చేశాడు. తను గోదారి బిడ్డ. గోదారి నీళ్లు తాగొచ్చాడు. అందుకే ప్రతీ పాటలోనూ ఓ చమత్కారం కనిపిస్తుంది. కాబట్టే.. ఇన్నేళ్లయినా తన పాట బోర్ కొట్టదు. కొట్టబోదు కూడా.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..



# ఆయన కేరళ ఫిడేల్ క్యాస్ట్రో!

1964లో కమ్యూనిస్ట్ పార్టీ రెండుగా చీలిపోయిన తర్వాత కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) సీపీఎం వ్యవస్థాపక సభ్యుల్లో అచ్యుతానందన్ ఒకరు. 2006-2011 మధ్య కేరళ ముఖ్యమంత్రిగా పని చేశారు అచ్యుతానందన్. 2001 నుంచి కేరళ పాలక్కాడ్ జిల్లాలోని మలంపుళ నియోజకవర్గాన్ని తన రాజకీయ క్షేత్రంగా మార్చుకున్నాడు అచ్యుతానందన్. పదిసార్లు పోటీలో నిలిస్తే.. 7 సార్లు గెల్చి.. కేవలం 3 సార్లు మాత్రమే ఓటమి చవిచూసిన రాజకీయ యోధుడు వీ.ఎస్.



పార్టీతో విభేదించి.. ప్రజలు కోసం తాపత్రయపడ్డ సోషలిస్ట్.. ఆ కమ్యూనిస్ట్ కురువృద్ధుడు అచ్యుతానందన్. కేరళ రాష్ట్రంలో, దేశ రాజకీయాల్లో తన మార్క్‌తో పాటు.. కమ్యూనిజాన్ని వారసత్వంగా వదిలి వెళ్లిన పోరాట యోధుడు! 101 ఏళ్లు జీవించి.. 2025 జూలై 21న పూర్ణాయుష్కుడిగా వెళ్లిపోయి.. ఎర్రజెండా ఎత్తున నిల్చిన కామ్రెడ్ అచ్యుతానందన్‌కు రెడ్ సెల్యూట్‌తో అక్షర నివాళి!

## వివక్షనెదుర్కొంటూ బాల్యం నుంచి కమ్యూనిజం వైపు.. కమ్యూనిజాన్నీ ధిక్కరించి సోషలిజం వైపు!

1923 అక్టోబర్ 20న వెంతలతర అయ్యన్ శంకరన్, అక్కమ్మ అలియాస్ కాత్యాయని దంపతులకు పుటిన వీ.ఎస్.ది ఈళవ అనే అణగారిన సామాజికవర్గం. బాల్యం నుంచి వివక్ష సర్వసాధారణమైన బతుకు అతడిది. మశూచితో తల్లి మంచంబాట పట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోలేక మరణించినప్పుడు అచ్యుతానందన్ వయస్సు కేవలం 4 ఏళ్లు. తండ్రి మరణించినప్పుడు కేవలం 11 సంవత్సరాలు.

1938లో 15 ఏళ్ల వయస్సులో ట్రేడ్ యూనియన్ పోరాటాల నుంచి స్ట్రీట్ ఫైట్ ప్రారంభించాడు అచ్యుతానందన్. అదే సమయంలో స్వాతంత్ర్య ఉద్యమంలోనూ చేరారు. ఆ తర్వాత రెండేళ్లకు బ్రిటీష్ కంపెనీ అయిన ఆస్పిన్ వాల్ హౌజ్‌లో పనిచేస్తున్న సమయంలో అప్పటి అవిభక్త కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియాలో సభ్యుడయ్యాడు.

1946 ట్రావెన్ కోర్ దివాన్.. సీపీ రామస్వామి అయ్యర్ పాలనలో దుర్భరమైన పరిస్థితులు, ఆర్థిక దోపిడీ, రాజకీయ అణిచివేత వంటివాటికి ఎదురు నిలబడి.. నాటి పున్నప్ర- వాయలార్ పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాడు. అందుకుగాను, ఐదేళ్ల పాటు జైలు ఊచలు లెక్కించిన వీ.ఎస్.. ఓ నాలుగేళ్లు అదృశ్యమై పోయి అజ్ఞాతంలో గడిపాడు. ఓవైపు ట్రావెన్ కోర్‌లో ప్రజలు దుర్భర స్థితి అనుభవిస్తుంటే.. మరోవైపు భారత యూనియన్‌లో ట్రావెన్ కోర్‌ను కలపకుండా స్వతంత్రంగా ఉంచేందుకు జరుగుతున్న ఎత్తులను అడ్డుకోవడానికి నాడు పెద్ద పోరాటానికే తెరలేచింది. కొబ్బరి కార్మికులు, రైతులు రోడ్లపైకొచ్చి తిరుగుబావుటా ఎగురవేస్తున్న రోజులవి. ట్రావెన్ కోర్ దివాన్ తనను చంపించేందుకు ప్రయత్నిస్తే.. తనను ఓ ఇద్దరు దొంగలు ఎలా కాపాడారో కూడా ఓసారి దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వీఎస్ పేర్కొన్నారట. ఆ సమయంలో తనపై దాడిచేసి పాలా అటవీ ప్రాంతంలో పడేయబోతుంటే.. దొంగతనంలో నిందితుడిగా జైలుకొచ్చిన ఓ దొంగ తనను ఆసుపత్రికి చేర్చేలా సాయపడ్డాడని గుర్తు చేసుకున్నారు అచ్యుతానందన్.

1967లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శిగా ఉన్నప్పుడే అచ్యుతానందన్ అలప్పుళలో వసుమతియమ్మను వివాహమాడారు. 1980 నుంచి 1991 వరకూ వీ.ఎస్. మూడుసార్లు సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు. 1980లలో పార్టీలో సైద్ధాంతిక సంఘర్షణ తీవ్రమైనప్పుడు.. ఎలంకులమ్ మనక్కల్ శంకరన్ నంబూద్రి ప్రసాద్ అండతో తన పదవిలో కొనసాగాడు. ఎం.వీ. రాఘవన్ రివజనిస్ట్ ధోరణులను ప్రదర్శించి, ముస్లింగ్ లీగ్ వంటి కమ్యూనిస్ట్ వ్యతిరేక పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని కోరుకున్నప్పుడు ఆ సైద్ధాంతిక పోరుకు తెరలేచింది. అలాంటి సమయంలో, ఎం.వీ. రాఘవన్ వెంట ప్రజలెవ్వరూ నడవద్దని కేరళ అంతటా పర్యటించాడు వీ.ఎస్.అచ్యుతానందన్. తన కఠినమైన నిర్ణయాలు, ఆలోచనల వల్ల అంతర్గత రాజకీయాలతో 1985లో సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో నుంచి సస్పెండయ్యాడు. ఆ తర్వాత పార్టీ లైన్‌కు కట్టుబడి ఉంటానని చెప్పి వివరణ ఇవ్వడంతో మళ్లీ పార్టీ ఆయన్ని అక్కున జేర్చుకుంది. ఆ తర్వాత అదే ఎం.వీ.రాఘవన్‌ను మళ్లీ సీపీఐ(ఎం) సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడుగానీ, వీఎస్ ఎందుకు రాఘవన్‌ను విభేదించాడో పార్టీ గుర్తించగలిగింది.



### అచ్యుతానందర్ రాజకీయ జీవితంలో ప్రధాన విజయాలేంటి..?

విళింజంలో అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్సిష్మెంట్ ప్రాజెక్ట్‌ను సాధించడంలో వీ.ఎస్.ది కీలకపాత్ర. 2010లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌లో మళ్లీ కాంగ్రెస్ హయాంలో అవినీతి జరిగిందనీ ఆయనే ఆరోపించారు. ఆ సమయంలో అప్పటి ఎల్డీఎఫ్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. విళింజంలో రాళ్లకు బదులు కాంక్రీట్ బ్లాకులతో బ్రేక్ వాటర్ నిర్మాణం చేయడమంటే ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నట్లేనని కుండబద్ధలు కొట్టారు. ఆ పోర్ట్‌కు సంబంధించిన ప్రాజెక్టును అదానీకి అప్పగించడాన్నీ ఆయన వ్యతిరేకించారు.

అలాగే, కొచ్చి మెట్రో రైలు ప్రాజెక్టులోనూ అచ్యుతానందన్‌ది కీలకపాత్ర. కేరళ మంత్రివర్గం 3వేల కోట్ల రూపాయల ప్రాజెక్టును ఆమోదించి.. 2008లో వీఎస్ హయాంలోనే కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించింది. హిల్ రిసార్ట్స్‌కు కేరాఫ్‌గా.. టీ గార్డెన్స్‌కు చిరునామాగా చెప్పుకునే మున్నార్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వెంటనే చర్యలు తీసుకుని వీ.ఎస్. అచ్యుతానందన్ సామాన్యుల హీరో అయ్యాడు. 2007లో ఎవరి సాయం లేకుండా శబరిమల కొండపైకి ట్రెక్కింగ్ చేస్తూ యాత్రకు వెళ్లిన మొట్టమొదటి కమ్యూనిస్ట్ మాజీ ముఖ్యమంత్రిగా కూడా ఆయన పేరు మార్మోగింది. నిత్య అధ్యయనశీలిగా.. ప్రోగ్రెసివ్ డెవలప్మెంట్‌తో పాటు.. రాజీలేని విధానాలతో ప్రగతిశీల నాయకుడిగా వీ.ఎస్. అచ్యుతానందన్ కేరళ ఫిడెల్ క్యాస్ట్రోగా అభివర్ణించబడ్డాడు.



### అతి పెద్ద వయస్సున్న కేరళ ముఖ్యమంత్రిగా..

1996లోనే అచ్యుతానందన్ ముఖ్యమంత్రి అవుతారని అంతా భావించారు. కానీ మరారికులం నియోజకవర్గంలో ఊహించని ఆయన ఓటమి.. ఆయన్ను ఆ పదవి నుంచి అప్పుడు దూరం చేసింది. చివరకు, వీ.ఎస్.. 82 ఏళ్ల వయస్సులో కేరళ 11వ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి.. రాష్ట్రానికి అంత పెద్ద వయస్సులో ముఖ్యమంత్రైన వ్యక్తిగా కూడా రికార్డులకెక్కాడు.

అచ్యుతానందన్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టేకంటే ముందు.. అసలా అసెంబ్లీ ఎన్నికల్లో అచ్యుతానందన్‌కు టిక్కెట్ ఇచ్చేందుకే పార్టీ నిరాకరించిన పరిస్థితులేర్పడ్డాయి. వర్గవిభేదాల కారణంగా ఏకంగా అచ్యుతానందన్‌ను కొందరు కేరళ రాజకీయాల నుంచే దూరం పెట్టే యత్నం చేశారు. కానీ, వీ.ఎస్ అభిమాన, అనుచరగణం ఆయన్ను తిరిగి తీసుకురావాలనే డిమాండ్‌తో చేపట్టిన క్యాంపెయిన్ పార్టీకి అచ్యుతానందన్‌ను తిరిగి తీసుకొచ్చి టిక్కెట్ ఇవ్వక తప్పని పరిస్థితిని ముందుంచింది.

### అచ్యుతానందన్‌ను ఎందుకు పక్కనబెట్టాలనుకున్నారు..?

ఎస్ఎన్‌సి - లావాలిన్ అవినీతి కేసు విషయంలో అచ్యుతానందన్ పార్టీకి కొరకరాని కొయ్యగా మారాడు. మధ్యేమార్గంగానో, రాజీ మార్గంలోనో ఉండకుండా.. రాజీలేని అవినీతి పోరాటంతో పార్టీకేం చేయాలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇడుక్కిలో మూడు జలవిద్యుత్ ప్రాజెక్టుల సంబంధించిన విషయంలో నాటి కేరళ ప్రభుత్వం, కెనడియన్ కంపెనీ అయిన ఎస్ఎన్‌సి-లావాలిన్‌తో ఓ ఒప్పందం ఖరారు చేసుకుంది. 1997లో కుదిరిన ఆ ఒప్పందంలో 374 కోట్ల రూపాయల అవినీతి కుంభకోణం జరిగినట్టు ప్రచారం జరిగింది. యూడీఎఫ్-కాంగ్రెస్ అలియెన్స్‌గా ఉన్న ప్రభుత్వ హయాంలో ఈ ఒప్పందానికి బీజం పడగా.. ఆ సమయంలో ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న పినరయి విజయనే నాటి విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయనే ఆ కీలక సంతకం చేశారు.







అప్పుడు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న అచ్యుతానందన్.. పినరయి విజయన్‌పై సీబీఐ దర్యాప్తును సమర్థించాడు. పార్టీ రాష్ట్ర కార్యదర్శింగా ఆమోదం కూడా తెలిపాడు. కానీ, మిగిలిన పార్టీలో చాలామంది సభ్యులంతా వ్యతిరేకించారు. వారంతా విజయన్‌కు అండగా నిలిచారు. అంతర్గత రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగానే అచ్యుతానందన్.. విజయన్‌పై సీబీఐ విచారణకు ఆమోదం తెలిపాడంటూ పార్టీలోని చాలామంది ముఖ్యులు ఆయనపై ఫైర్ అయ్యారు. ఆ తర్వాత 2009లో ఇక అచ్యుతానందన్‌ను సీపీఐ(ఎం) పోలిట్ బ్యూరో నుంచి శాశ్వతంగా తొలగించింది. అయితే, కేంద్రకమిటీలో మాత్రం ఆయన్ను స్వాగతించారు. ఇప్పటికీ 15 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కేరళ అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగిన ఆయన రికార్డ్ అలాగే పదిలంగా ఉంది. అయితే, ఏ విజయన్ పైనైతే సీబీఐ విచారణను సమర్థించి, రాష్ట్ర కార్యదర్శి హోదాలో ఆమోదం తెలిపాడో.. అదే విజయన్ తాను ముఖ్యమంత్రి అయ్యాక మళ్లీ అదే వీ.ఎస్. అచ్యుతానందన్ పైనున్న నమ్మకంతో ఆయనను పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్‌గా నియమించారు. అలా 2016 నుంచి 2021 వరకూ అచ్యుతానందన్ కేరళలో అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ కమిషన్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.

- బాతాఖానీ సౌజన్యంతో..

---

# ఉప రాష్ట్రపతి రేసులో తెలుగు నేతలు!

(మొదటిపేజీ తరువాయి)

తెలుగుదేశంలో ఉంటే కచ్చితంగా ఈ పదవి తెలుగు రాష్ట్రాలకు దక్కే అవకాశం లేకపోలేదు. ఈ మేరకు కేంద్రం నుంచి టీడీపీ అధినేతకు సూచన ప్రాయంగా కబురు అందినట్టు తెలిసింది. గతంలో మన రాష్ట్రానికే చెందిన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా పని చేసినందున ఇప్పుడు ఆయన స్థాయికి తగ్గ వ్యక్తిని ఎంపిక చేయాలని టీడీపీ భావిస్తోందట.

### టీడీపీలో అప్పుడే పోటీ

ఈ నేపథ్యంలో టీడీపీలో అప్పుడే పోటీ నెలకొంది. మాజీ స్పీకర్లు కావలి ప్రతిభాభారతి, యనమల రామకృష్ణుడు వంటి నేతలు అధిష్టానం నుంచి కబురొస్తే ఉప రాష్ట్రపతి పదవికి సిద్ధమన్న సంకేతాలను పార్టీకి పరోక్షంగా పంపించారు. ముఖ్యమంత్రి తరపున నారా లోకేష్ రెండు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు నేతలతో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిసింది. రెండు రోజుల్లో ఎవరు సరైన అభ్యర్థులో తేల్చుకొని అన్ని సమీకరణాలు తేలిన తర్వాత అధికారికంగా ప్రకటించే అవకాశం లేకపోలేదు. ఈ రేసులో ప్రస్తుతానికి ప్రతిభాభారతి ఒకడుగు ముందున్నారు. రాజకీయాలకు దాదాపు దూరం అనుకున్న సందర్భంలో ఆమె కుమార్తె కావలి గ్రీష్మకు పార్టీ పిలిచి మరీ ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. ఆ సమయంలోనే ప్రతిభాభారతి కోటా వేరేగా ఉందంటూ లోకేష్ వ్యాఖ్యానించడం గమనార్హం. జస్టిస్ పున్నయ్య కుమార్తెగా, మాజీ స్పీకర్‌గా, మంత్రిగా సుదీర్ఘకాలం పని చేసిన ప్రతిభాభారతి గత ఐదేళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. ఉప రాష్ట్రపతి పదవికి కావాల్సింది కూడా ఇదే. త్వరలో బీహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ సమీకరణాల రీత్యా ఆ రాష్ట్రానికి ఉప రాష్ట్రపతి పదవి కేటాయించే అవకాశం ఉంది. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి కీలక భాగస్వామి జేడీయూ(జనతాదళ్ యునైటెడ్)కు చెందిన ఎంపీ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఉప రాష్ట్రపతి పదవికి ఎంపిక చేసే అవకాశం ఉంది. హరివంశ్ ప్రస్తుతం రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఆ పదవిని బీహార్‌కు కేటాయించకపోతే అశోక్‌గజపతి రాజును ఆకస్మికంగా గోవా గవర్నర్‌గా పంపినట్టే, అదే బ్యాచ్‌కు చెందిన ప్రతిభాభారతిని ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్ వేయడానికి రమ్మని కేంద్రం పెద్దల నుంచి కబురొచ్చినా ఆశ్చర్యం లేదు.

# ఇరుకురోడ్లు.. ఆక్రమణలు



- ప్రకాష్‌నగర్ కాలనీవాసుల ఆవేదన
- కారొస్తే ద్విచక్ర వాహనానికే తోవుండదు
- రోడ్డుపైనే సంచారజాతులు కంచం, మంచం
- అత్యవసర వాహనాలకూ దారిలేని వైనం
- అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు శూన్యం
- తక్షణమే సమస్య పరిష్కరించాలి
- జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు బీవీ రవిశంకర్



**శ్రీకాకుళం పట్టణంలోని ప్రకాష్‌నగర్ కాలనీవాసులు ఇరుకు రోడ్లు, ఆక్రమణల సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ప్రకాష్‌నగర్ కాలనీ నుంచి న్యూకాలనీకి వెళ్లే సందులో ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వడం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఇరుకు రోడ్డు కావడం, ఆపై రోడ్డుపైనే చెత్తాచెదారం వేయడంతో మరింత ఇరుకుగా మారింది. దీనితో ఒక కారు వస్తే, పక్క నుంచి మరో ద్విచక్ర వాహనం కూడా దాటలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ రెండు వైపుల నుంచి కార్లు వస్తే, ఒకరు కనీసం 100 అడుగుల దూరం వెనక్కి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. దీనివల్ల నిత్యం ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాధుడే లేరు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రద్దీ రోడ్డు మలుపు వద్ద కనీసం పది అడుగులు కూడా లేకపోవడం శోచనీయం.**

**సత్యంన్యూస్, శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణానికి మధ్యలో ఉండటంతో అన్ని రోడ్లూ అనుసంధానమై ఉన్నాయి. ఈ కారణంగా రద్దీ ఎక్కువైంది. ఇరుకు మలుపు కారణంగా వాహన చోదకులు గట్టిగా హారన్ల మ్రోగిస్తూ.. మలుపునకు మరోవైపు గలవారికి సంకేతాలు ఇవ్వవలసి వస్తుంది. దీనితో చోదకుల విలువైన సమయం వృథా అవడమే కాకుండా, ధ్వని కాలుష్యం విపరీతంగా పెరిగింది.

### ప్రత్యామ్నాయ మార్గాల్లోనూ సమస్యలు

పోనీ ఈ కాలనీవాసులు అటు గొంటివీధి రోడ్డు నుంచి వెళ్లటానికి ప్రయత్నిస్తే, అక్కడ రోడ్డుపైనే ఆటోరిక్షాలు, ద్విచక్రవాహనాలను నిబంధనలకు విరుద్ధంగా పార్క్ చేస్తున్నారు. ఈ రెండు మార్గాలు కాకుండా, ఇటూ కత్తెర వీధి వైపు వెళ్తే అక్కడ ఉన్న చిన్న మలుపు ప్రమాదకరంగా మారింది. మసీద్ వైపు మార్గంలో కూడా ఇబ్బందికరంగా ఉంది. మలుపు వద్ద సంచార జాతులువారు రోడ్డు పైనే వంటావార్పులు చేయడం, మంచాలు వేసి పడుకోవడంతో ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ఇక్కడ సంచారజాతుల వారిని మరోచోటికి తరలించారని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నా, ఫలితం లేకుండా పోయింది. ఈ నాలుగు ప్రధాన మార్గాల్లో నెలకొన్న సమస్యల వల్ల కాలనీవాసులకు నిత్యం రాకపోకలు నరకప్రాయంగా మారాయి. అంబులెన్స్‌లు, అగ్నిమాపక వంటి అత్యవసర సేవలకు చెందిన వాహనాలకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అధ్యక్షులు బీవీ రవిశంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

### అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాగ్రహం

ప్రతిరోజూ ఈ రోడ్డులో వెళ్లాలంటే భయమేస్తోందని, ఒక కారు వస్తే, ఇంకో కారు కదలడానికి కూడా చోటు ఉండదని, అధికారులు ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రకాష్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి వి.రవికుమార్ కోరారు. మరో ప్రతినిధి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు స్కూల్‌కి వెళ్లే సమయంలోను, ఆఫీసులకు వెళ్లే సమయంలోను చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారని, ఈ రోడ్డును వెడల్పు చేయాలని, లేదా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని కోరారు. కాలనీ వాసులు తమ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. వర్షాకాలంలో ఈ రోడ్లపై నీరు నిలిచి మరింత ఇబ్బందికరంగా మారుతోందని వారు తెలిపారు. రోడ్లపై పారిశుధ్య సమస్యలు, వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల దోమలు పెరిగి అనారోగ్యాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు.

### తక్షణమే స్పందించాలని డిమాండ్

ప్రకాష్‌నగర్ కాలనీ ప్రజలు ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, రోడ్లను వెడల్పు చేయాలని లేదా ట్రాఫిక్ సమస్యను తగ్గించడానికి తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై ఆక్రమణలను తొలగించాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు తక్షణమే స్పందించి, ప్రజల కష్టాలను తీర్చాలని వేదిక అధ్యక్షులు బీవీ రవిశంకర్ విజ్ఞప్తి చేశారు.

# రెడ్డిగారూ.. మీరు సూపర్ 'బాస్'!

మొదటిపేజీ తరువాయి

టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మినాయుడును పోలీసులు అరెస్టు చేసి సోమవారం రాత్రి న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో పోలీసులు జైలుకు తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగిందని చెబుతూ వచ్చిన పోలీసులు అమ్మినాయుడు అరెస్టుతో ఇందులో రాజకీయ కోణం ఉందని చెప్పకనే చెప్పారు. ఈ కేసులో మొదట 12 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అందులో గోపి హత్యతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న 8 మందిని అరెస్టు చేశారు. హత్యతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉన్నవారు ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో విచారణ జరుపుతున్నట్టు 8 మందిని అరెస్టు చేసిన సమయంలోనే పోలీసులు వెల్లడించారు. అందులో భాగంగానే సాంకేతిక ఆధారాలు, కాల్‌డేటా ఆధారంగా పోలీసులు అమ్మినాయుడి ప్రమేయంపై పూర్తి ఆధారాలు సేకరించినట్టు తెలిసింది. దీంతో సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో మూడు వాహనాల్లో సీఐ, ముగ్గురు ఎస్ఐలు, సిబ్బందితో కలిసి ఫరీద్‌పేటలోని ఆయన నివాసంలోనే అమ్మినాయుడిని అదుపులోకి తీసుకొని న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.

గోపీని హత్య చేసినవారంతా అమ్మినాయుడు ఫాలోవర్లు కావడంతో మొదటి నుంచి ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. 8 మందిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులకు అమ్మినాయుడు ప్రోత్సాహంతోనే హత్య చేసినట్టు నిందితులంతా ఒప్పుకున్నారన్న చర్చ సాగుతుంది. అయితే ఈ హత్య కేసులో కొందరిని తప్పించేందుకు అధికార పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేసినట్టు జోరుగా ప్రచారం సాగుతుంది. అయితే పోలీసు బాస్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఫరీద్‌పేటలో రాజకీయ, వర్గ విభేదాలు, ఆధిపత్యం కారణంగా మరో హత్య జరగడానికి అవకాశం ఇవ్వనని కఠినంగా వ్యవహరించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో రాజకీయ ఒత్తిడి పనిచేయలేదని పోలీసు శాఖలోనే చర్చ సాగుతోంది. గత ఏడాది కూన ప్రసాద్ హత్య సమయంలో ఇదే మాదిరిగా అధికారులు వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయం గ్రామంలో వ్యక్తమవుతుంది. ప్రసాద్ హత్య కేసులో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారిని రాజకీయ ఒత్తిడితో తప్పించడం వల్లనే గోపి హత్యకు బీజం పడిందని అభిప్రాయం స్థానికుల్లో ఉంది. హతుడు గోపిపై ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నాయని, హత్య చేసిన వారందరూ గోపీ బాధితులే అని పోలీసులు ఇంతకు ముందే ప్రకటించారు. వైకాపా హయాంలో గోపీపై నిఘా ఉంచి ప్రాథమిక దశలోనే చెక్ పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గ్రామంలో కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఉన్నా ఇప్పటికీ ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఫరీద్‌పేటకు చెందిన భార్యాభర్తలు జి.ఉమామహేశ్వరరావు, భవాని మొదటి నుంచి ఎంపీపీ మొదలవలస చిరంజీవికి అనుచరులుగా కొనసాగుతూ వచ్చారు. ఆ సందర్భంలోనే భవానీకి వైకాపా హయాంలో సీఎఫ్‌గా నియమించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎఫ్ నుంచి భవానీని అమ్మినాయుడు తప్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు కారణంగా భార్యాభర్తలు ఉమా, భవానీ ఇద్దరూ గొడవలు పడడం, చిరంజీవి వీరి మధ్య రాజీ కుదిర్చే ప్రయత్నం చేశారు. అయితే చిరంజీవి పంచాయితీ నచ్చకపోవడంతో అమ్మినాయుడును భవానీ ఆశ్రయించింది. దీన్ని అవకాశంగా తీసుకొని భవానీతో పోలీస్‌స్టేషన్‌లో భర్త ఉమాపై ఫిర్యాదు చేయించినట్టు తెలిసింది. గృహ హింస కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పోలీసులపై ఒత్తిడి పెంచారని తెలిసింది. పోలీసులు మాత్రం కౌన్సిలింగ్ నిర్వహించాలని ప్రయత్నాలు చేసినా భర్త ఉమా సహకరించలేదు. దీంతో భర్త ఉమాను కాదని భార్య భవానీ ఇంటిలో సామాన్లు తీసుకోవడానికి అమ్మినాయుడు పంపించిన 8 మంది అనుచరులతో వెళ్లి తలుపులు పగలగొట్టి తన సామాన్లతో కొయిరాల జంక్షన్‌కు వచ్చింది. ఆ సందర్భంగా అక్కడకు వచ్చిన గోపిపై 8 మంది దాడి చేసి హత్య చేశారు. అందుకే దీన్ని పోలీసులు కుటుంబ కలహమన్నారు. వాస్తవానికి ఇక్కడ ఆధిపత్యం కోసం రెండు గ్రూపులు ఉండటం వల్ల మాత్రమే ఒకే ఇంటిలో ఉండే భార్యాభర్తలు తమ సమస్యను రెండు గ్రూపుల వద్ద పంచాయితీకి తీసుకువెళ్లారు. ఎప్పట్నుంచో ఇక్కడ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకునే గతం ఉండటం వల్ల గోపీని మట్టుబెట్టడానికి భార్యాభర్తల గొడవ అవకాశంగా మారింది. వాస్తవానికి ఇక్కడ కొత్తకోట అమ్మినాయుడును ఇప్పుడు అరెస్ట్ చేయడం వల్ల ఫ్యాక్షన్ ఆగిపోదు. ఎందుకంటే.. వైకాపా హయాంలో అధికారం చెలాయించిన నాయకులు టీడీపీ నేతలను, ఒక్క మాటలో చెప్పాలంటే అమ్మినాయుడుతో సహా అందరికీ తొక్కిపెట్టి నార తీశారు. మిగతా ప్రాంతాల్లో ప్రభుత్వం మారితే ప్రతిపక్షంలో ఉన్నవారికి కాంట్రాక్ట్ పనులు దక్కకపోవడమో, చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడమో, చిరుద్యోగులకైతే బదిలీ చేయడమో చేస్తుంటారు. కానీ ఇక్కడ వైకాపా అధికారంలో ఉన్నప్పుడు కనీసం ఆ ఊరిలో ఉండటానికి కూడా టీడీపీ నేతలకు అవకాశం ఇవ్వలేదు. అసలు హత్యా రాజకీయాలకు మొదట తెర లేపిందెవరు? ఎవరు ఇప్పటికీ కాఫ్ పంచాయితీలు నిర్వహిస్తున్నారు? దందాలు చేస్తున్నదెవరు? వంటి ప్రాథమిక సమాచారం తెచ్చుకుంటే అసలు ఫరీద్‌పేటలో ఏం చేస్తే హత్యా రాజకీయాలు రూపుమాపుతాయో అర్థమవుతుంది.

# ఎరువు కోసం ఎదురుచూపులు

## రైతులను దగా చేస్తున్న ప్రైవేట్ డీలర్లు

(సత్యంన్యూస్,పాతపట్నం)

వ్యవసాయశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఎరువులు కోసం రైతులు ఎదురుచూస్తున్న పరిస్థితి దాపరించింది. సబ్సీడీ ఎరువులు అందుబాటులోలేక పోవడంతో ప్రైవేట్ డీలర్లును ఆశ్రయించి దగా పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఆరకోర ఎరువులను అందుబాటులో ఉంచి చేతులు దులుపుకున్నారని అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు. వాటిని కొందరికే పంపిణీ చేసి మిగతావి బ్లాక్ మార్కెట్‌కు తరలించుకుపోయారని విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గం పరిదిలో కొత్తూరు మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. మండలంలో డిమాండ్ మేరకు ఎరువులు అందుబాటులో లేకపోవడంతో వ్యవ సాయశాఖ అధికారి వద్ద గోడు వెల్లబుచ్చుకుంటున్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు సరఫరా చేయడంలో విఫలమ య్యారని ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. రైతు సేవా కేంద్రాలుతో పాటు 50శాతం ఎరువులు విక్రయించడానికి ప్రైవేట్ డీలర్లుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీన్ని ప్రైవేట్ డీలర్లు అవకాశంగా తీసుకొని కొత్తూరు, సీతంపేట, భామిని మండలలో యూరియా, డీఏపీ కావలంటే జింక్, గుళికలను లేదంటే గడ్డి మందును రైతు లకు అంటగడుతున్నారు. దీంతో అవసరం లేకున్నా వాటిని కొను గోలు చేయాల్సి వస్తుందని రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ డీలర్లు చర్యలు రైతులకు భారంగా మారిందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు అవసరమైన మేరకు ప్రభుత్వం సబ్సీడీ రూపంలో యూరియా అందుబాటులో ఉంచకపోవడమే కారణమని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. యూరియా రూ. రూ.270లుకు లభ్యమవుతుంటే ప్రైవేట్‌లో అదనం మరో రూ.100లు చెల్లించి కొనుగోలు చేయా ల్సిన పరిస్థితి ఉందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఏపీ మార్కెట్ ధర రూ.1300లకు లభ్యం కావల్సి ఉండగా ప్రైవేట్‌లో రూ. 200లు అధనంగా వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొత్తూరు మండల కేంద్రం నుంచి యూరియాను నకిలీ బిల్లులతో సరిహద్దులు దాటించి ఒడిశాకు తరలిస్తున్నారని ఆరోప ణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే ఎరువులు అందుబాటులోకి వస్తాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.




# ఏ జిల్లా వారికి ఆ జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేజీబీవీ పాఠశాలలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు ఏ జిల్లాకు చెందినవారికి ఆ జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలని డీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పూజారి ప్రసన్న, పేడాడ కృష్ణారావులు కోరారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 28నుంచి రెండువిడతలుగా ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను సబ్జెక్టు టీచర్స్‌కు రాష్ట్రం మొత్తం పైన ఒకే కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సర్వ శిక్ష అభియాన్ సంచాలకులు షెడ్యూల్ కార్యక్రమాన్ని ఇచ్చారన్నారు. దీని వలన ఆ మహిళా ఉపాధ్యాయులు ఆరోగ్య పరంగాను, రక్షణ పరంగాను అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. దీనిని గమనించి ఏ జిల్లా ఉపాధ్యాయులకు ఆ జిల్లాలోనే శిక్షణ ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# బీజేపీ జిల్లా కార్యదర్శిగా దమయంతి

(సత్యంన్యూస్, కొత్తూరు)



మండలానికి చెందిన కె.దమయంతి బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆమెను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దమయంతి మాట్లాడుతూ పార్టీలో చేరినతనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

# స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థుల ఆధార్ అప్డేట్ చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25జిల్లాల తోపాటు శ్రీకాకుళం జిల్లాలో గల స్కూళ్లు, కాలేజీల్లో 15 ఏళ్లు దాటిన విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం కోరారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏడేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్డేట్ చేయడం తప్పనిసరి చేసిందన్నారు. ఇప్పటికే 5ఏళ్లు లోపు వయస్సు ఉన్న పిల్లలు గతంలో ఐరిష్ బయోమెట్రిక్, వేలిముద్రలు లేకుండా కేవలం వారి ఫోటోలు, జనన ధ్రువీకరణ పత్రం, చిరునామా ఇచ్చి ఈ కార్డ్ పొందే అవకాశం ఉండేదన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వ నూతన ఆదేశాలతో రాష్ట్రంలో ఐదు నుండి ఏడేళ్ల మధ్య పిల్లలు అధిక శాతం మంది పిల్లలు అప్‌డేట్‌కు ముందుకు రాకపోవడం, తల్లిదండ్రులకు అవగాహనా లేమి, తగినన్ని ఆధార్ సెంటర్లు అందుబాటులో లేకపోవడం వల్ల ఈ ఆధార్ కార్డులు అప్ డేట్ కాక చెల్లుబాటు అవకాశాలు లేవన్నారు. దీంతో రాష్ట్రంలో లక్షలాది మంది పిల్లలు, విద్యార్థులు వివిధ స్కాలర్‌షిప్‌లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు కోల్పోతున్నారన్నారు.

# గార మండలంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు చేపడుతున్న బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గార మండలంలోని కళింగపట్నం, కె.మత్స్యలేశం గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలను నెరవేర్చక ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తుందని ఆరోపించారు. ఇప్పుడు వచ్చే పాలకులకు ఈ హామీలపై నిలదీయాలని కోరారు. గత వైకాపా పాలనలో ప్రభుత్వం చెప్పిన హామీలను జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా అమలు చేశారో, ఇంటింటికి ఏ విధంగా పథకాలు అందాయో వివరిస్తూ, ప్రజలను చైతన్యపరుస్తూ భవిష్యత్తులో మోసం చేసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ప్రతినిధి తమ్మిన అప్పలరాజు, పంచాయతీ కార్యకర్తలు, మండల కన్వీనర్ పీసా గోవిందరాజులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొండు రఘురాం, మాజీ డిసిఎంఎస్ అధ్యక్షులు గొండు, కృష్ణమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు అరవల రామకృష్ణ, అంధవరపు బాల కృష్ణ, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు బరాటం నాగరాజు, మండల సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ విభాగ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# చిలకపాలెంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

వైకాపా ఆధ్వర్యంలో చేపడుతున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలకపాలెంలో చేపట్టిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు లేవని, గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి పథకాలను తాము చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, మాటలకు గ్యారెంటీ లేదని, చంద్రబాబు నాయుడు మోసగాడని విమర్శించారు. కూటమి పాలనలో చోటు చేసుకున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించే బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సనపల నారాయణరావు, బోర సాయిరామ్ రెడ్డి, డోల వెంకటరమణ, జరుగుళ్ళ శంకర్, కొత్తకోట్ల సూర్యారావు, ముద్దాడ శంకర్, మాడుగుల జగదీశ్, పైడి శ్రీనివాసరావు, డొంక వెంకటరమణ, చిలక సన్యాసప్పడు, డొంక అప్పలరాజు, తండ్యాల లక్ష్మణరావు, సీరపు శ్రీరామ్మూర్తి, ఆబోతుల నరసింహమూర్తి, సీరపు తిరుపతిరావు, ఇప్పిలి నరసింహమూర్తి, బచ్చు మల్లేష్ రెడ్డి, సూరపు మురళి, ముని పాపారావు, డొంక శ్రీను, డొంక ఆనంద్, కాళ్ళ శ్రీను, ఎల్ల రామారావు, ఎ.సూర్యనారాయణ, చిలక నాగభుషణ్, ఎం.లోకేష్, సిహెచ్ మోహన్, డొంక సురేష్, కె.సత్తిబాబు, ఎస్.సన్యాసి రావు, పి.అశోక్, ఎస్.రమణ, బలగ గణపతి, గొర్లె ప్రకాష్ రావు, సర్పంచ్లు, ఎంపిటీసులు, అనుబంధ సంఘ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.